

# మమకారానిదే గెలుపు

గొట్టుముక్కల సత్యనారాయణరాజు

''ఏమండీ!
మీకు టెలిగ్రాం వచ్చింది''
ఆఫీసుకెళ్ళడానికి సిద్ధమవు తున్న అభిలాష్ భార్య పిలుపుతో లోపలినించి హడావిడిగా బయటికొచ్చాడు.
''ఏంటీ! మనం మొన్నామధ్య అప్లై చేసిన గ్రీన్‌కార్డు అప్లికేషన్ ఓకే అయి వీసా మంజూరైందా?'' ఆశగా బయటికొస్తూ తనకు తోచింది చెప్పాడు అభిలాష్.

''ఏమోనండీ! మీరు సంతకం చేసి తీసుకోండి'' అని చెప్పి భార్య అభినేత్రి లోపలికి వెళ్ళిపోయింది.

సంతకం చేసి టెలిగ్రాం తీసుకుని ఒక్కసారిగా హతాశుడైపోయాడు అభిలాష్.

ఆఫీసుకెళ్లడానికి తయారైన అతను టెలిగ్రాంలోని సందేశాన్ని చూసి ఏంచేయాలో


SBH HOME LOANS
Permanent address guaranteed.
SBH
State Bank of Hyderabad
You can always bank on us.

తెలీక అక్కడే కూలబడ్డాడు.

భర్తతో పాటూ తను కూడా ఆఫీసుకి బయల్దేరే హడావిడిలో ఉన్న అభినేత్రి భర్త ఎంతసేపటికీ రాకపోవడంతో ఏం జరిగిందో అంటూ భర్త దగ్గరకు పరుగుతీసింది.

''ఏంటండీ అలా అయిపోయారు? అమెరికన్ కాన్సులేట్ నుంచి కాదా ఆ టెలిగ్రాం?'' అని అడిగింది అభినేత్రి.

''అవును...''

''అయితే ఎందుకండీ అంత హైరానా?'' అసలు విషయం తెలీక మామూలుగా అడిగేసింది భర్తని అభి.

''అసలు సంగతి తెలిస్తే నీవు అలా అనవు తెలుసా?నాలో సగమైన నీవు నాకు కలిగిన బాధ ఏంటో కూడా అర్థం చేసుకోలేకపోతున్నావు'' ఆవేదనగా అన్నాడు అభిలాష్.

''ఏంటండీ మీలో మీరే సణుక్కుంటున్నారు. మీరీ మధ్య చాలా మారిపోయారు'' అంటూ కాస్త అలిగింది అభి.

''అదికాదే. నేను మారిపోవడం కాదు. ఈ టెలిగ్రాం చదివితే నీ ముఖం నల్లగా మారిపోతుంది తెలుసా?'' అన్నాడు అభిలాష్.

''ఏంటండీ తెలుగు టీవీ సీరియల్స్ డైలాగ్స్ చెబుతున్నారు'' అంటూ లోపలినించి వచ్చి భర్త పక్కన ఆశీనురాలైంది.

''మీ గ్రీన్‌కార్డు కోసం మీరు పంపిన అభ్యర్థనని తిరస్కరిస్తున్నాం. మిగిలిన వివరాల కోసం వెంటనే అమెరికన్ కాన్సులేట్ ఆఫీసుని సంప్రదించండి'' అని ఉంది ఆ టెలిగ్రాంలో.

అది చదివి వెంటనే కళ్ళు తిరిగి పడిపోయినపనైంది ఆమెకి.

తాము అప్లై చేసిన వీసా అప్లికేషన్‌ని ఎందుకు తిరస్కరించారో ఆమెకి అర్థంకాలేదు వారికి.

ఆ తర్వాతిరోజు అమెరికన్ కాన్సులేట్‌కి వెళ్లి కారణం తెలుసుకోలని అప్పాయింట్‌మెంట్ కోసం దరఖాస్తు చేశారు.

* * *

''వారం తర్వాత మీకు వివరాలు తెలియజేస్తాం. ఒక్కసారి మా కార్యాలయంలోని ప్రజా సంబంధాల అధికారిని సంప్రదించండి'' అని మరో టెలిగ్రాం వచ్చింది.

అసలు విషయం తెలుసుకోవాలని భార్యాభర్తలిద్దరికీ ఎంతో ఆత్రంగా ఉంది.

వీసా అప్లికేషన్ పూరించేటప్పుడు ఏమైనా పొరపాట్లు చేశామా అని ఆలోచించసాగారు. వారి ఆలోచన ఎంతకీ తెగలేదు. ఇక చేసేదేం లేక పీఆర్‌ఓ గారి అప్పాయింట్‌మెంట్ కోసం ప్రయత్నం చేశాడు అభిలాష్.

* * *

వారికి అప్పాయింట్‌మెంట్ ఇచ్చిన రోజు రానే వచ్చింది.

ఇద్దరూ కాన్సులేట్ కార్యాలయానికి వెళ్లారు.

అక్కడే ఉన్న సెక్యూరిటీ వారికి తమ గురించి చెప్పి, పీఆర్‌ఓని కలవాలని అప్పాయింట్‌మెంట్ సంగతి వివరించారు.

వారిని లోనికి వెళ్లడానికి అనుమతించి అధికారి ఛాంబర్‌కి దారి చూపించాడు సెక్యూరిటీ అధికారి.

ఇద్దరూ ఎడతెగని ఆలోచనలతో అధికారిని కలిశారు.

''సార్! మా వీసా అప్లికేషన్‌ని ఎందుకు పొడిగించలేదు. మేం ఏమన్నా పొరపాటు చేశామా?'' టెన్షన్‌గా అడిగాడు అధికారిని అభిలాష్.

''అలాంటిదేంలేదు. మీరు అమెరికన్ ప్రభుత్వం నిర్దేశించిన పద్ధతిలోనే అప్లై చేశారు. అయితే ఎందుకు ఈ వీసా అప్లికేషన్‌ని రిజెక్ట్ చేశారో మాకు కూడా తెలియడం లేదు. మీకు మరింత సమాచారం కావాలంటే కొన్నాళ్ళు ఆగాల్సిందే'' అన్నాడాయన.

మళ్లీ పిడుగు మీద పడినట్లైంది.

పీఆర్‌ఓని కలిస్తే తమ సమస్య ఓ కొలిక్కి వస్తుందని భావించిన వారికి మళ్లీ సమస్య మొదటికి రావడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు.

తమ వీసా పొడిగిస్తే ఇక్కడే సెటిలై పోదామని భావిస్తే ఇలా చుక్కెదురైందని వారు బాధపడుతున్నారు.

* * *

''ఏమండీ! ఎందుకలా ఉన్నారు? అబ్బాయి గురించి ఆలోచిస్తున్నారా? వాడు వస్తానని చెప్పాడు కదా!'' అంది భర్తని ఓదారుస్తూ అభిలాష్ తల్లి అన్నపూర్ణమ్మ.

''నీవు బాగానే ఓదార్చుతావు నన్ను. కానీ నీకు మాత్రం లేదా వాడిని చూడాలని. ఎప్పుడో పీజీ పూర్తయ్యాక కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేయడానికని అమెరికా వెళ్లిన కొడుకు నాలుగేళ్లయినా తిరిగిరాలేదు. అదిగో వస్తున్నా. ఇదిగో వస్తున్నానని చెప్పడం తప్ప ఏనాడూ రాలేదు. వాడికెక్కువ ఇష్టమైన పండుగ సంక్రాంతికైనా వస్తాడని ఎదురు చూస్తున్నాం. అయినా రావడం లేదు. ఇక మనల్ని పట్టించుకుంటాడంటావా? మనం ఇక్కడున్నామని వాడికసలు గుర్తుందా? పెళ్లి చేసుకుని కొత్త పెళ్లాంతో వెళ్లిన వాడికి మనం గుర్తుండకపోయినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు'' కొడుకుపై ఆక్రోశం వెళ్లగక్కాడు అభిలాష్ తండ్రి పాండురంగారావు.

భర్త సంగతి తెలిసిన ఇల్లాలే కనుక ఏమీ అనకుండా మౌనంగా ఉండిపోయింది. ఆ మౌనమే పాండురంగారావుగారికి నచ్చడం లేదు. కొడుకు గురించ ఎంత నెగిటివ్‌గా మాట్లాడినా ఆమె ఏమాత్రం స్పందించదు. కొడుకుని మాత్రం ఏమీ అనదు. మనసులోనే బాధపడుతుంది తప్ప కొడుకుని తిట్టడం ఆమెకి ఇష్టం ఉండదు.

ఎందుకంటే మాతృదేశం రావాలని, తన తల్లిదండ్రుల్ని చూడాలని వాడికెప్పుడూ అన్పిస్తే అప్పుడు వస్తాడని ఆమె నమ్మకం.

అయితే ఈ విషయంలో పాండురంగారావు గారు మాత్రం తన కొడుకుని ఎలాగైనా ఇండియా రప్పించాలని తెలిసిన వారితో ఎప్పుడూ సంప్రదిస్తూనే ఉన్నాడు.

అలా సంప్రదించిన పిమ్మట ఆయన మిత్రుడు కొడుకొకడు ఓ సలహా ఇచ్చాడు. ఆ సలహాని ఆయన అనుసరించాడు. అంతే ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి.

* * *

తమ గ్రీన్‌కార్డు అప్లికేషన్ తిరస్కారం గురించి తెలిసినవారిని సంప్రదిస్తూనే ఉన్నారు. ఇక అదీ పని కాదు ఇదీ పనికాదు అని ఆలోచించి మళ్లీ అమెరికన్ కాన్సులేట్‌కి వెళ్లి ఆ పీఆర్‌ఓని బ్రతిమాలారు. ఇక ఆయన అసలు సంగతి బయటపెట్టక తప్పలేదు.

''చూడండి అభిలాష్‌గారూ! సాధారణంగా మా దేశంలో శాశ్వత నివాసం ఉందామనుకునేవారి గురించి మేం క్షుణ్ణంగా పరిశీలించాకనే గ్రీన్‌కార్డుని మంజూరు చేస్తాం. ఈ క్రమంలో మీ గురించి ఎంక్వయిరీ చేసే టైంలో మా అధ్యక్షుని పేరున


SBH TWO-WHEELER LOANS

Takes just
48 hours to kickstart.



SBH
State Bank of Hyderabad
You can always bank on us.

వచ్చిన ఓ ఉత్తరం మా నిబంధనల్ని మార్చేసింది. అంతే...ఆ ఉత్తరంలోని అంశాల్ని పరిశీలించి ఒక నిర్ణయానికి వచ్చాం. ఆ నిర్ణయం కారణంగానే మీ గ్రీన్‌కార్డుని తిరస్కరించాం'' అని చెప్పాడు పీఆర్ఓ.

ఆ ఉత్తరం ఏంటో, ఎందుకు తిరస్కరించారో అర్థంకాలేదా దంపతులకు. మళ్లీ అసలు విషయం రాబట్టడానికి ప్రయత్నం చేశారు.

''అసలు సంగతి చెప్పేదాకా మీరు నన్ను వదిలిపెట్టేలా లేరు. ఉద్యోగాల కోసం, ఉన్నత చదువుల కోసం అమెరికాకి వచ్చే తమ పిల్లలు ఇక తమ స్వదేశాలకు రాకుండా అక్కడే సెటిలైపోవడం వల్ల వృద్ధాప్యంలో తమకు ఆసరా ఉండడం లేదని, వారిమీద ఆశలు పెట్టుకున్న తాము పండుటాకులమై రాలిపోతున్నామని ఓ వృద్ధజంట రాసిన ఉత్తరం అది. ఇక నుంచి అమెరికాలో ఉద్యోగాలు చేస్తూ అక్కడే స్థిరనివాసం ఏర్పాటుచేసుకోవాలనుకునేవారు తమ స్వదేశంలో ఉన్న తల్లిదండ్రుల పరస్పర అంగీకారం తీసుకునేలా చర్యలు తీసుకుంటే తమలాంటి తల్లిదండ్రులకు స్వాంతన చేకూరుతుందని, ఈ విషయాన్ని పరిశీలించమని రాశారు. వారి లేఖ మా అధ్యక్షుడి మనసుని కదిలించింది. అంతే...క్షణాల్లో కొత్త నిబంధన ఒకటి రంగం మీదికి వచ్చింది. గ్రీన్‌కార్డు అప్లికేషన్‌తో పాటూ తల్లిదండ్రుల అంగీకారపత్రం కూడా తప్పనిసరి చేశాం. ఈ నిబంధన అమలులోకి వచ్చిన వెంటనే మీరు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేశారు. మీ దరఖాస్తుని మేం తిరస్కరించాం. కాబట్టి మీరు ఆ నిబంధనని సంతృప్తి పరచడానికి ప్రయత్నించండి'' వివరించాడు అమెరికన్ కాన్సులేట్ పీఆర్ఓ.

ఆయన చెప్పింది విని తల్లీదండ్రుల్ని కలవాలని నిర్ణయించుకున్నాడు అభిలాష్. అంతేకాదు తనతో పాటూ తన భార్యని, పిల్లల్ని కూడా ఇండియాకి తీసుకురావాలని, కొన్నాళ్ళు ఇక్కడ ఉండాలని నిర్ణయించుకున్నాడు. అక్కడికెళ్లిన తర్వాత తల్లీదండ్రుల్ని ఒప్పించైనా వారి సంపూర్ణాంగీకారపత్రాన్ని పొందొచ్చని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. ఎప్పుడూ ఊరికి వస్తున్నానని చెప్పి వారిని ఊరించడం తప్ప ఎన్నడూ వెళ్లిన పాపాన పోని తను ఇప్పుడు నిజంగా వస్తున్నానని, ఫలానా రోజు ఫ్లైట్‌లో వస్తున్నట్టు ఉత్తరం రాశాడు.

* * *

ఇంటికి వచ్చినప్పటినుంచీ ఆ ఉత్తరం గురించే ఆలోచిస్తున్నాడు అభిలాష్.

''ఏంటండీ! ఏం ఆలోచిస్తున్నారు. ఇండియా ఎప్పుడు వెళుతున్నారు'' అని అడిగింది అభినేత్రి.

''త్వరలో.కానీ నేను ఒక్కడినే కాదు నీవూ, పిల్లలు కూడా'' అన్నాడు.

ఆమెకి తెలియకుండా తమ ప్రయాణానికి ఏర్పాట్లు చేశాడు.

''వచ్చే ఆగస్టులోనే మన ప్రయాణం. మన వీసా గడువు అక్టోబర్‌తో ముగుస్తుంది. ఈలోపే మనం ప్రయత్నాలు చేయాలి'' అన్నాడు అభి.

''అలాగే'' అంది అభినేత్రి.

ఆ ఉత్తరం రాసింది తన తల్లిదండ్రులే అని అతనికి ఏమాత్రం తెలియదు.

* * *

''ఏంట్రా పాండూ! ఇంత ఆనందంగా ఉన్నావ్? నాక్కూడా చెబితే నేనూ సంతోషిస్తాగా'' అన్నాడు పాండురంగారావు బాల్యమిత్రుడు కుటుంబరావు.

''ఆ...ఏంలేదులే! మా అబ్బాయి, కోడలు వస్తున్నారు. చాలాకాలం నుంచి వారి కోసం కళ్లు కాయలు కాచేలా చూస్తున్నాను కదా. వారి రాక నాకు ఎంతటి ఆనందాన్నిస్తుందో నీకు తెలుసు కదా!'' అన్నాడాయన.

''అదికాదురా! నాకు అర్థంకావడం లేదు. ఇంతకాలం రానివాడు ఇప్పుడొస్తున్నాడంటే నాకు నమ్మశక్యంగా లేదు. నిజంగా వస్తాడంటావా?'' సందేహం వెలిబుచ్చాడు కుటుంబరావు. ఎందుకంటే అమెరికాకెళ్లిన పదేళ్లనుంచీ పాండురంగారావు కొడుకు, కోడలు అదిగో వస్తున్నాం, ఇదిగో వస్తున్నాం అంటూనే ఉన్నారు. ఇక్కడికొచ్చిన పాపాన పోలేదు. అందుకే అతనికి వారు వస్తారన్న నమ్మకం కుదరడం లేదు.

ఆ సందేహాన్నే మిత్రుని ముందు వెలిబుచ్చాడు.

''నిజమేరా! ముందు నేను కూడా నమ్మలేదు. వాడినుంచి వచ్చిన ఉత్తరం చదివితే నీకే తెలుస్తుంది. వచ్చేవారమే వాడు వస్తున్నాడు. కానీ వాడికి వాడుగా రావడం లేదు. వాడి రాకవెనుక పెద్ద కథే ఉంది, ఎప్పుడూ ఉత్తరం రాయనివాడు ఆ వివరాలు అన్నీ తెలియజేస్తూ చాంతాడంత ఉత్తరం రాశాడు. ఏది ఏమైనప్పటికీ వాడు వస్తున్నాడు అదే పదివేలు''

''ఏంటా కథ. నీకేమైనా చెప్పాడా?''

''నేను వాడి రాకకోసం చేసిన చిన్న ప్రయత్నమే ఇందుకు కారణం. వాడెలాగైనా ఇక్కడికి తప్పకుండా రావాలని నేనో పథకం వేశాను. అది సక్సెస్ అయింది'' అని సగం అర్థమయ్యీ అర్థమవ్వకుండా చెప్పాడు పాండురంగారావు ఆనందాతిశయంతో.

''నీవు చెప్పింది నాకు అసలు అర్థంకాలేదు. ప్రయత్నం అంటున్నావు, పథకం అంటున్నావు. ఏంటో కాస్త అర్థం అయ్యేలా చెప్పరా బాబూ!'' అంటూ విసుక్కున్నాడు కుటుంబరావు.

బాల్య మిత్రుడికి తను చేసిందీ, ఆ తర్వాత చకచకా జరిగిన పరిణామాల గురించి క్లుప్తంగా చెప్పాడు పాండురంగారావు. అంతేకాదు ఈ సంగతి ఎట్టిపరిస్థితుల్లోనూ తన కొడుక్కి చెప్పద్దని మాట తీసుకున్నాడు మిత్రుడి నుంచి.

తను రాసిన ఉత్తరం తనకే కాదు తనలా కొడుకు కోసం పరితపించే తల్లిదండ్రులకి గొప్ప మేలు చేసినందుకు ఎంతో సంతోషించాడు. డాలర్ల వేటలో పడి మమకారాన్ని, ఆదరణని వారు మర్చిపోకుండా ఉండాలని కోరుకుంటున్నాడాయన. సుదీర్ఘకాలం తర్వాత తన ఇంటికి వస్తున్న కొడుకు, కోడల్ని తనివితీరా చూడాలని, మనవళ్లతో ఆడుకోవాలని ఆయన ఆరాటపడుతున్నాడు.

తన కొడుకు రాకకోసం తను తన భార్య ఎంతగా పరితపించామో, ఎన్ని నిద్రలేని రాత్రిళ్లు గడిపామో అవన్నీ కొడుకు రాకతో మరిచిపోవాలనుకున్నాడు. ఆ మధురక్షణాలు అందరు తల్లిదండ్రులకీ ఉండాలని ఆయన కలలు కంటున్నాడు. కొడుకు, కోడళ్ళు, కూతుళ్లు, అల్లుళ్ళు తలుచుకోవాలి గానీ పాండురంగారావు లాంటి వారికోరిక తీర్చడం అసాధ్యం కాదు. వాళ్లు తమ నుంచి సంపూర్ణాంగీకారం తీసుకుని మళ్ళీ అమెరికా వెళ్లిపోయినా ఫర్వాలేదు, కానీ వారు వస్తున్నందుకు ఆయనకి ఎంతో సంతోషంగా ఉంది.

పాండురంగారావు చిరు ప్రయత్నం డాలర్ల వ్యామోహం కంటే మమకారం విలువైనదని తేటతెల్లంచేసింది.

*

